అంబేద్కర్ చిత్రంపై పోస్టర్‌ను అతికించిన

బిజెపి క్షమాపణ చెప్పాలి

- గోనెగండ్లలో దళిత మద్దిలేటి కుటుంబంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు - కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని స్విమ్మింగ్‌పూల్ వద్ద కెసి కెనాల్ గోడపై వేసిన అంబేద్కర్ చిత్రంపై పోస్టర్‌ను అతికించిన బిజెపి క్షమాపణ చెప్పాలని, గోనెగండ్ల మండల కేంద్రంలో దళిత కుటుంబంపై దాడి చేసిన సుల్తాన్ రజాక్, సుల్తాన్ గౌస్, జైబున్‌ను వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శనివారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. కెవిపిఎస్ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఆంధ్రా గురుస్వామి అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఎమ్‌డి.ఆనంద్ బాబు మాట్లాడారు. కర్నూలు నగరంలో స్విమ్మింగ్ పూల్ వద్ద ఉన్న కెసి కెనాల్ గోడపై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని వేసి కొత్త బ్రిడ్జి మార్గాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మార్గ్‌గా గత రెండు సంవత్సరాలుగా గౌరవించుకుంటున్నారని తెలిపారు. అలాంటి చోట అంబేద్కర్ చిత్రం పై బిజెపి పోస్టర్లు అతికించడం, వారికి అంబేద్కర్‌పై ఉండే గౌరవానికి నిదర్శనం అన్నారు. అదే గోడపై 100 పోస్టర్లు వేసుకోవడానికి అవకాశం ఉన్నా వాటన్నింటినీ కాదని అంబేద్కర్ పైనే వేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. వారి రాజకీయ ప్రచారాన్ని అంబేద్కర్ చిత్రాన్ని మూసివేసి చేసుకోవడం అనేది, రాజ్యాంగ నిర్మాతను అవమానించడమేనని, బిజెపి నాయకులు ఘటనకు వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. గోనెగండ్ల మండలం కేంద్రంలో దళితుడైన మద్దిలేటి గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని, అక్రమంగా సాగు చేసుకోవాలనే దురుద్దేశంతో, దళితుడిని భూమిలోకి దిగుకుండా గత మూడు సంవత్సరాలుగా అడ్డుకుంటున్నాడన్నారు. ఇప్పటికైనా భూమిలో నీళ్లు పెట్టి విత్తుకుందామని పొలానికి పోయిన దళిత మద్దిలేటిని, అతని భార్య నరసమ్మను పొలం దగ్గరే ఉన్న సుల్తాన్ రజాక్ , అతని భార్య కుమారుడు జైబున్, సుల్తాన్ గౌస్ లు విచక్షణారహితంగా దాడి చేసి, తిరిగి తానే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టే ప్రయత్నం చేశాడన్నారు. దాడికి గురైన మద్దిలేటి, నరసమ్మ లు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి మెరుగైన వైద్య సహాయం అందించడంతోపాటు, వారిపై దాడి చేసిన సుల్తాన్ రజాక్ కుటుంబం పై అట్రాసిటీ కేసును నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, డి.విజయమ్మ, హెచ్. జయరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.పెద్దబాబు, హెచ్ మారయ్య, గిత్తరి రమేష్, మామిడికాయల రాజు, జిల్లా నాయకులు రాజా రమేష్, వెంకటేశ్వర్లు, చక్రపాణి, మదన గోపాల్, అంజి, సుమాల రాజు, అంతోని, శ్రీనివాసులు, లక్ష్మన్న, కిరణ్, నాగప్ప, రత్నం, బీదన్న, ప్రదీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొని పలు వివరాలను ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తెచ్చారు. పెండింగ్ లో ఫార్మ్ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎపిక్ కార్డులకు సంబంధించి ఇప్పటి వరకు 2.24లక్షల కార్డులను జనరేట్ చేశామని, వాటిలో 1.36లక్షల మేరకు ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు కల్పించమన్నారు. కేవలం రెండు ర్యాంపులు, ఒక టాయిలెట్ పనులు పెండింగ్ ఉన్నాయని, సోమవారం నాటికి అవి కూడా పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ సిబ్బందికి సంబంధించి ఉద్యోగుల వివరాలను నమోదు చేస్తామని, ఫిబ్రవరి 15వ తేదిలోపు నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించేందుకు గాను రహదారులను పరిశీలించామని, రహదారులకు మరమ్మతులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటునానమన్నారు. డిస్పాచ్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లకు ఉన్న దూరాన్ని అంచనా వెయ్యడంతో పాటు అందుకు తగిన మ్యాపులను కూడా సిద్ధం చేసుకున్నామన్నారు. హోమ్ ఓటింగ్ ఓటర్ల పై కూడా ప్రత్యేక దీష్టి సారిస్తున్నామన్నారు. భద్రతకు సంబంధించి జిల్లా ఎస్‌పితో కలిసి సమీక్షించామన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్లు ఒక విడత శిక్షణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించామన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో పూర్తి స్థాయి మొబైల్ నెట్‌వర్క్ ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వివరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

హక్కుల పరిరక్షణలో బాధ్యత వహించాలి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా బాధ్యత వహించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సిఎస్‌పిసిఆర్) సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు, శనివారం నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్‌లో కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం, ఉమ్మడి జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రోహిణీ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంతీయ సదస్సులో ముఖ్య అతిథిగా బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి మాట్లాడారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాలల హక్కులను కాపాడాలన్నారు. బాలల సంక్షేమం వంద శాతం నెరవేరాలనే ఏకైక ధ్యేయంతో పాటు చర్చించిన వివిధ అంశాలతో ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నామని అన్నారు. బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి , అనంతపురం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి, బాలల సంక్షేమ సమితి సభ్యులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

జీవనోపాధులను మెరుగుపరచడమే లక్ష్యం

- సెర్ప్ సిఇఒ ఇంతియాజ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహిళల జీవనోపాధులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సెర్ప్ సిఇఒ ఎమ్‌డి.ఇంతియాజ్ తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సెర్ప్, హిఫర్ ఇంటర్నేషనల్ సొసైటీ వారి సహకారంతో చిన్న తరహా, పెరటి కోళ్ల పెంపకం యూనిట్స్‌ను సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ ప్రారంభించారు. ఆయనతోపాటు హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ బెన్ని, ఎపి ఫుడ్ ప్రాసెస్ సొసైటీ స్టేట్ లీడ్ సుభాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ మాట్లాడారు. సెర్ప్, హిఫర్ ఇంటర్నేషనల్ సొసైటీ వారి సహకారంతో చిన్న తరహా పెరటి కోళ్ల పెంపకం యూనిట్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సొసైటీ వారు చిన్న కోడి పిల్లలను సరఫరా చేయడం మొదలుకొని పెంపకం చేసిన వాటి మాంసాన్ని విక్రయించే వరకు సలహాలు, సూచనలు ఇస్తామన్నందుకు సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో 1000 యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కర్నూలు జిల్లాలో వెల్దుర్తి, క్రిష్ణగిరి, కల్లూరు మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేసుకుని చిన్న తరహా పెరటి కోళ్ల పెంపకం 20 యూనిట్లను ప్రారంభించినట్లు చెప్పారు. హిఫర్ ఇంటర్నేషనల్ సొసైటీ సహకారంతో కర్నూలు జిల్లాలో మండలానికి 120 యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇందులో భాగంగా పైలెట్ మండలాల్లోని 20 యూనిట్లను కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. పైలెట్ మండలాల్లో 150 మంది మహిళలను గుర్తించి వారికి శిక్షణ కూడా ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో 50 మంది మహిళలకు పెరటి కోళ్ల పెంపకం యూనిట్లకు రుణాలు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. చిన్నకారు రైతులు, మహిళలు వారి జీవనోపాధులను మెరుగుపరుచుకోవాలని హాజరైన మహిళలకు సూచించారు. డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా, ఏపీడీ శ్రీధర్, డాక్టర్ అనిల్ కుమార్, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ రామచంద్రయ్య, ఎపిఎంఐపి పీడీ ఉమాదేవి, జిల్లా సమైక్య అధ్యక్షులు సీతా బాయ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్ప్ సిఇఒ ఇంతియాజ్

పిల్లల పండుగ..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు బాలోత్సవం కర్నూలు నగరంలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదికగా నిర్వహించారు. 3వ పిల్లల పండుగ రెండు రోజుల పాటు సాగింది. చిన్నారులతో బాలోత్సవంలో సందడి నెలకొంది. మొదటి రోజు తొలుత ఇన్‌ఛార్జీ డిఇఒ శామ్యూల్ పాల్ జాతీయ జెండాను, బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య కర్నూలు బాలోత్సవం జెండాను ఎగురవేశారు. కల్యాణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు క్లాసికల్ డ్యాన్స్, వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. రెండో రోజు విద్యార్థులకు జానపద నృత్యం, నృత్యం, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, లఘు నాటిక పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం అవుతుందని ముగింపు కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. కర్నూలు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జెఎన్.శేషయ్య అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కెవి.సుబ్బారెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ కెవి.సుబ్బారెడ్డి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ, ప్రయివేట్ విద్యాసంస్థల సంఘం సలహాదారులు పివిబి.సుబ్బయ్య, మైత్రి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ టి.వినోద్, రవీంద్ర విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ జి.వంశీ బహుమతులను ప్రదానం చేశారు.

జిల్లాకు మొండిచేయి

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2.86 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఆ బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన కేటాయింపులేవీ కనిపించలేదు. జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ వంటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు కేటాయించలేదు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ప్రస్తావన లేదు. ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల కోసం నిధుల కేటాయింపు జరగలేదు. రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

అవీ..ఇవీ..అన్నీ..

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కర్నూలు నగరంలో ఈపీఎఫ్ ఆఫీసు ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అశోక్ నగర్ సెంటర్ నుంచి ఈపీఎఫ్ ఆఫీసు వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. ధర్నాలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, హయ్యర్ పెన్షన్ ఆప్షన్ అందరికీ వర్తింపజేయాలని, రైల్వే చార్జీలలో రాయితీ కల్పించాలని, ఉచిత ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8న విజయవాడలో ధర్నాకు వెళ్లకుండా సచివాలయం వద్ద, రైల్వే స్టేషన్లలో, బస్సు స్టేషన్లలో బలవంతంగా అరెస్టు చేయడానికి నిరసనగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ముందు నిరసన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌కు సన్నాహకంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసనలు చేపట్టారు.



పాఠశాల వార్షికోత్సవసభలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

విద్యాసంపద గొప్పది

రిడ్జ్ పాఠశాల వార్షికోత్సవంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సంపద ఎంత ఉన్నా విద్యాసంపదే గొప్పదని సామాజంలో మంచి గౌరవం, గుర్తింపు ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కర్నూలు నగర శివారులోని రిడ్జ్ పాఠశాల పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , వృక్ష సంరక్షకులు గ్రీన్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ అబ్దుల్ ఘని హాజరయ్యారు. పాఠశాల సిఇఒ జి.గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసానిమాట్లాడుతూ సంపదలు ఎన్ని ఉన్నా వృథాయేనని, విద్యాసంపద ఎవరికైతే ఉంటుందో సమాజంలో వారు గొప్పగా గౌరవింపబడతారన్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య కర్నూలు నగరంలో అనేక విద్యాసంస్థలను నెలకొల్పి ఎందరో భావి భారత పౌరులను తయారు చేస్తున్నారన్నారు. నిజంగా వారు చేస్తున్న కృషికి అందరం కృతజ్ఞతలు తెలపాలన్నారు. డాక్టర్ అబ్దుల్ ఘని మాట్లాడుతూ నేడు పర్యావరణమంతా అల్లకల్లోలమై మానవుని అభివృద్ధి గొప్ప అభివృద్ధిగా భావించి విచక్షణారహితంగా వృక్షాలను తొలగించి కాలుష్యానికి మనమే ప్రధాన కారణమవుతున్నామన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగోళం వేడెక్కి ఓజోన్ పొర దెబ్బతిని సమస్త ప్రాణికోటి ప్రమాదంలో పడుతుందన్నారు. విద్యార్థులు కంకణబద్ధులై వృక్ష సంపదను వృద్ధి చేసే బాధ్యతను తీసుకొని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ మారుతున్న విద్యావ్యవస్థకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు స్వతహాగా రూపొందించు కుంటూ విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ జివిఎం.మోహన్ కుమార్, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, వైస్ ఛైర్మన్ జి.వంశీధర్ ,రిడ్జ్ పాఠశాల సమన్వయకర్త జి.సౌమ్య, ప్రిన్సిపల్ రాజేంద్రన్, కార్పొరేటర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు

నేడు యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల సమావేశం మందిరంలో ఆదివారం ఉదయం యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, రాష్ట్రసహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలకు హాజరవుతారన్నారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఆశ వర్కర్లకు అభినందనలు : సిఐటియు

పజాశక్తి-కర్నూలు కార్పొరేటర్

ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా అకుంఠిత దీక్షతో పోరాడి ప్రభుత్వం దిగివచ్చే విధంగా చేసిన ఆశ వర్కర్లకు సిఐటియు జిల్లా కమిటీ అభినందనలు తెలియజేస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు తెలిపారు. విజయవాడలో జరుగుతున్న 36 గంటల దీక్షకు భగ్నం చేయడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసిందని వారి ప్రయత్నాలను కూడా ఎదిరించి కర్నూలు జిల్లా నుండి దాదాపు 200 మంది ఆశా కార్యకర్తలు విజయవాడ చేరుకొని ఆందోళనలో పాల్గొనడం హర్షనీయమని అన్నారు. జిల్లా నుండి బయలుదేరిన మరో రెండు వందల మందిని గుంతకల్లు రైల్వే స్టేషన్లో నిర్బందిస్తే, నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కొనసాగించారన్నారు. ప్రభుత్వ ధమనకాండను వ్యతిరేకిస్తూ ఈనెల 9న జిల్లాలో 24 మండలాల్లో దాదాపు 1000 మంది ఆశా కార్యకర్తలు ఆందోళనలో పాల్గొనడం చూస్తుంటే ఆశా కార్యకర్తలు ప్రభుత్వంపై ఎంత కసితో ఉన్నారో తెలుసుకుందన్నారు. ఆందోళనలో పాల్గొన్న ప్రతి ఆశా కార్యకర్తకు సిఐటియు అభినందనలు తెలిపింది. ఈనెల 9న ప్రభుత్వం నిర్వహించే ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేసే కార్యక్రమాన్ని బైకాట్ చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి సాయంత్రం చర్చలు జరిపిందని, చర్చలలో ఆశా కార్యకర్తలకు సామాన్య సెలవులు, మెడికల్‌లీవ్ లు, మేటర్నిటీ లీవ్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు భవిష్యత్తులో చేయించకుండా సర్క్యులర్ జారీ చేయడానికి అంగీకరించినట్లు తెలిపారు. పనిచేయని ఫోన్ల స్థానంలో కొత్త ఫోన్లు ఇవ్వడానికి అంగీకరించిందని అన్నారు. వయోపరిమితిని 60 నుండి 62 సంవత్సరాలకు పెంచినట్లు తెలిపారు. మట్టి ఖర్చులకు రూ.20,000 ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిపారు. రూ.ఆరు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వంతో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారన్నారు. హామీలు అమలు చేయడానికి సిద్ధం లేకపోతే పోరాటాలకు ఆశా వర్కర్లు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నాటు సారా స్థావరాల పై విస్తృత దాడులు

1900 లీటర్ల నాటు సారా ఊటబెల్లం ధ్వంసం, 250 లీటర్ల నాటు సారా స్వాధీనం

- జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని బంగారు పేటలో నాటు సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు చేసి భారీ ఎత్తున నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ అన్నారు. సోమవారం శనివారం బంగారుపేటలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్‌ను కర్నూల్ డిఎస్‌పి కె. విజయ శేఖర్ నేతృత్వంలో రెండవ పట్టణ సిఐ ఇంతియాజ్ బాష తన సిబ్బందితో కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ దాడులను చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా నాటు సారా, మద్యం అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజలు డయల్ 100 గాని, స్థానిక పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ దాడుల్లో 19 వందల లీటర్ల నాటు సారా ఊట బెల్లంను ధ్వంసం చేసి, 250 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులలో కర్నూలు టు టౌన్ సిఐ ఇంథియాజ్ బాషా , ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపేటలో నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడి

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో 44, 45 వార్డుల్లో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్, మేయర్ బివై.రామయ్య, పలువురు వైసిపి నాయకులు, అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బివై .రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి, స్థానిక వార్డు కార్పొరేటర్ రాజేశ్వర్ రెడ్డి, గోశాల చైర్మన్ ఆదిమోహన్ రెడ్డి, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.ప్రభుదాస్ నాయకులతో కలిసి 44వ వార్డ్ లోని సిఐడి కార్యాలయంలో మునిసిపల్ సాధారణ నిధులతో సిసి రోడ్డును, 114 సచివాలయం పరిధిలో జిజిఎంపి నిధులతో చేపట్టి విస్తరణ పూర్తయిన సిసి రోడ్‌ను శనివారం ప్రారంభించారు. వైసిపి నాయకులు కర్ణాకర్ రెడ్డి, మధు, సవారి, ఇర్ఫాన్, శ్రీనివాస్ రెడ్డి, నాగి రెడ్డి, కృష్ణ రెడ్డి, రాము, మహేంద్ర, జంగిలమ్మ, మెర్రి, ఫయాజ్, ఫరూక్, సలీం, మునిసిపల్ అధికారులు ఇఇ షాకీర్, ఎఇ దినేష్, డిఇ.రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

45వ వార్డులో అభివృద్ధి : అనంతరం 45 వార్డులో రూ.78లక్షల 50 వేల అంచనాలతో 45వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు జిజిఎంపి నిధులతో విఆర్.కాలనీ రోడ్ నెం.2, రాజీవ్ నగర్ పార్క్ ఏరియా, టీచర్స్ కాలనీలో నిర్మించిన కాలువలు, సిసిరోడ్ల ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యుడు ప్రభుదాస్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్, 45వ వార్డ్ నాయకులు జమ్మన్న, ఖాదర్, చాంద్ బాషా, అబ్దుల్ రెహ్మాన్, శక్కర్ వలి, షైక్ షా, ఇలియాస్, ఖుద్దుస్, ఇమ్రాన్, ఇమామ్, జావీద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్‌ఖాన్, మేయర్ బివై.రామయ్య

మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డిఇఒ

డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ శనివారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న బోజనాన్ని పరిశీలించారు. 89శాతం మంది విద్యార్థులు అక్కడే భోజనం చేయడాన్ని తెలుసుకుని మిగతా 11శాతం విద్యార్థులు కూడా ఇక్కడే బోజనం చేసేలా పిల్లలకు అవగాహన కల్పించాలని హెచ్‌ఎం, సిబ్బందిని ఆదేశాంచారు. జడ్‌పి ఉన్నతపాఠశాలలో మెనూకు అనుగుణంగా వంట చేయడం, రుచికరంగానూ నాణ్యతగా ఉండడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ ఎడి సామ్యూల్ పాల్, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, వనజ కుమారి ఉన్నారు.

సినీనటుడు పృధ్వి, ఇతర కళాకారులను సన్మానిస్తున్న పత్తిఓబులయ్య బృందం

స్టేజి తల్లిపాలు..సినిమా డబ్బాపాలు...

సినీనటుడు పృధ్వి

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్ : నటజీవితంలో స్టేజీ తల్లిపాల వంటిదని, సినిమా డబ్బా పాల వంటిదని సీనియర్ నటులు థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ డైలాగ్‌తో సినీ రంగంలో పేరొందిన పృధ్వీ అన్నారు. శనివారం రాత్రి స్థానిక టిజివి కళాక్షేత్రంలో జబర్దస్త్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి పృధ్వి జబర్దస్త్ కళాకారులను సన్మానిస్తూ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సినిమా రంగంలో తనకు ప్రభాకర్ రెడ్డి గురువు వంటి వాడని నటునకు స్వచ్ఛంగా గంభీరంగా పలికే వాయిస్ ముఖ్యమని తెలిపారు. ఇటీవల కాలంలో సినిమా రంగం వివిధ రంగాల్లో వ్యాప్తి చెందుతున్నా నాటకానికి తిరిగి మహర్దశ ప్రాప్తిస్తుందని తెలిపారు. 50 సంవత్సరాల పైబడి నాటక రంగంలో జీవిస్తున్న టిజివి కళాక్షేత్రం కళాకారులను ఆయన అభినందించారు. సినిమాలోని డైలాగులను కొన్ని చెప్పి ప్రేక్షకులను అలరించారు. టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించారు. జనసేన నాయకులు హర్షద్ షేక్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు అర్జారామకృష్ణ పాల్గొన్నారు. జబర్దస్త్ కళాకారులు నవీన్ మోహన్, జె.రమేష్, శ్రీకళ హాస్య సన్నివేశాలను ప్రదర్శించారు.

18 ఏళ్ల సమస్య పరిష్కారం

- లబ్ధిదారుల్లో ఆనందం - వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఇంటి పట్టా అందజేస్తున్న ప్రదీప్ రెడ్డి

మండలంలోని ఎరిగేరి గ్రామంలో 18 ఏళ్ల నుంచి ఉన్న ఇంటి పట్టాల సమస్యను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేశారని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శనివారం ఎరిగేరి గ్రామంలో సర్పంచి గోవింద అధ్యక్షతన సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2006లో అప్పటి ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి గ్రామంలో 300 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. అప్పటి నుంచి బాధితులకు స్థలాలు చూపించడంలో నిర్లక్ష్యం జరిగిందన్నారు. ప్రభుత్వాలు మారినా లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమస్యను పరిష్కరించి రెవెన్యూ అధికారుల ద్వారా ఇళ్ల స్థలాల పొజిషన్లను చూపించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో పేదలను అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆ స్థలాల్లో గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో శాశ్వత నీటి పరిష్కారం కోసం రూ.40 లక్షలతో కౌతాళం అసిస్టెంట్ ద్వారా తాగునీటి పైపులైన్ వేసినట్లు తెలిపారు. సిసి రోడ్లతో పాటు సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని కోరారు. వైసిపి నాయకులు వెంకటరామిరెడ్డి, నీలకంఠ రెడ్డి, ధర్మన్న, ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, పంచాయతీ సెక్రటరీ యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి - వైసిపి నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియోజకవర్గంలో వైసిపి గెలుపునకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కోరారు. శనివారం పట్టణంలో వైసిపి నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసిపి ఎమ్మిగనూరు అభ్యర్థి బుట్టా రేణుక ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా పార్టీ కార్యాలయం ముందు వైసిపి జెండాను ఎగురవేశారు. అనంతరం వారు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ఎమ్మిగనూరులో వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని తెలిపారు. అనంతరం బుట్టా రేణుక మాట్లాడారు. నేటి నుంచి నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి వైసిపి కార్యకర్తలకు ఉన్న అండదండలు తమను గెలిపిస్తాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని, మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మరోమారు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నీలకంఠప్ప, బుట్టా రంగయ్య, రియాజ్ పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసిపి అభ్యర్థి బుట్టా రేణుక

బండగట్టు రైతులకు కుచ్చుటోపి

- రూ.3,30,52,000తో పరారీ
- నిందితునిపై బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - దేవనకొండ

ఓ వడ్డీ వ్యాపారి రైతులకు కుచ్చుటోపి పెట్టాడు. ఏకంగా రూ.3,30,52,000లతో పరారయ్యాడు. నిందితునిపై బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి మూడేళ్లుగా కోడుమూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో అటెండర్‌గా పని చేస్తున్నట్లు నమ్మబలికాడు. రైతులు బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేయిస్తూ బ్యాంకు మేనేజర్‌తో అనుకూలంగా ఉండేవాడు. వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ రైతుల వద్ద నమ్మకం పొందాడు. రెండు, మూడుసార్లు బ్యాంకు మేనేజర్‌ను కూడా గ్రామానికి పిలుచుకొచ్చి సమావేశాలు ఏర్పాటు చేశాడు. పంట రుణాల రెన్యువల్, బ్యాంకు లావాదేవీలు తదితర వాటిని వసూలు చేసేలా గ్రామస్తులకు నమ్మకం కలిగించాడు. ఈ మేరకు గ్రామానికి చెందిన 25 మంది రైతులతో లక్షలాది రూపాయలు తీసుకొని వారం, నెల వడ్డీలు చెల్లిస్తూ నమ్మకం కలిగించాడు. ఈ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని 25 మంది రైతులతో రూ.3,30,52,000 వసూలు చేసి కుచ్చు టోపీ పెట్టి గత రెండు రోజుల నుంచి అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన రైతులు స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. సిఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈనెల 5న గ్రామీణ బ్యాంకు మేనేజర్ బదిలీ అయినట్లు రైతులు తెలిపారు. బదిలీ అయిన రెండో రోజే చంద్ర అదృశ్యమయ్యాడని, బ్యాంకు సిబ్బందికి కూడా ఈ వ్యవహారంలో ఏమైనా హస్తముందా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమను మోసగించిన చంద్రను తక్షణమే అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న బండగట్టు గ్రామ రైతులు

టిడిపితోనే యువతకు ఉపాధి

- టిడిపి ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్‌గా శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మీనాక్షి నాయుడును కలిసిన శ్రీకాంత్ రెడ్డి

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు టిడిపితోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని టిడిపి ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ ఎసి.శ్రీకాంత్ రెడ్డి కోరారు. ఆయనకు పదవి కేటాయించడంతో శనివారం టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడును పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. 'మై ఫస్ట్ ఓట్ టు ఎపి' కార్యక్రమాన్ని టిడిపి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తనకు జిల్లా కోఆర్డినేటర్‌గా టిడిపి అధిష్టానం బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలోని కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గ ప్రాంతాల్లో డిగ్రీ కళాశాలల్లో ఓటు గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను అధిష్టానం నియమించిందన్నారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీలతో సమన్వయం చేసుకొని విద్యార్థులు, యువత టిడిపికి ఓటు వేసేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. 'జాబ్ కావాలంటే బాబు రావాలి' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అనంతరం మీనాక్షి నాయుడు మాట్లాడారు. ఓటు నమోదులో విద్యార్థులు శ్రద్ధ చూపడం లేదని, అలాంటి వారిని గుర్తించి అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు మొదటి ఓటు టిడిపికి వేయడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగు పడతాయని చెప్పారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ టిడిపికే సాధ్యమన్నారు. 'మై ఫస్ట్ ఓట్ టు ఎపి' కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ కార్యదర్శి బుద్ధారెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ ఛైర్మన్ రామస్వామి, క్రాంతి నగర్ రవి ప్రకాష్ ఉన్నారు.

ఆలూరు ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధం

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర నాయుడు

ప్రజాశక్తి - దేవనకొండ

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. విజయవాడలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వర రావు సమక్షంలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అవకాశం ఇస్తే పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. నియోకవర్గంలో రైతుల సమస్యలు, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై, రాయలసీమ నీటి ప్రాజెక్టుల కోసం, యువతకు ఉద్యోగాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

దరఖాస్తు చేస్తున్న మహేంద్ర నాయుడు

ఎజి కుటుంబం రాజకీయాలకు కొత్త కాదు

- రాష్ట్రంలో రాజకీయాలు చెడిపోయాయి... - టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేతల పితామహుడు, పద్మశ్రీ మాచాని సోమప్ప కుటుంబం రాజకీయాలకు కొత్తేమీ కాదని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ఎంజి కుటుంబానికి చెందిన నాలుగో తరం డాక్టర్ మాచాని సోమనాథ్ రాజకీయ ప్రవేశం చేయడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. శనివారం కోట్ల క్యాంపు కార్యాలయంలో టిడిపి నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పద్మశ్రీ మాచాని సోమప్ప, ఎంఎస్.శివన్న నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ ప్రజలకు నిస్వార్థంగా సహాయ, సహకారాలు అందించారని గుర్తు చేశారు. కోట్ల కుటుంబంతో ఎంజి కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. జిల్లాలో రెండు రిజర్వుడు స్థానాలను మినహాయించి మిగిలిన 12 ఓపెన్ స్థానాల్లో ఎవరైనా టికెట్ ఆశించవచ్చని, తప్పేమీ లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో రాజకీయాలు చెడిపోయాయని, ఎన్నికలు డబ్బుమయంగా మారాయని తెలిపారు. ప్రజలు, నాయకులు డబ్బులు ఆశించరాదని, విలువలతో కూడిన నాణ్యత రాజకీయాలు చేయాలని చెప్పారు. వైసిపి నాయకులు డబ్బులతో అధికారంలోకి వస్తున్నారని, వారికి ధనయజ్ఞం తప్ప జలయజ్ఞం తెలియదని విమర్శించారు. చంద్రబాబు సహకారంతో జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం, ఎల్ఎల్‌సి అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులకు జిఒలు తీసుకొస్తే, జగన్ అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ పనైపోయిందని, 'సిద్ధం' పేరుతో జగన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఎన్నికల యుద్ధానికి టిడిపి శ్రేణులు సంసిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ పొత్తుల అనంతరం చంద్రబాబు అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు. టిడిపి, జనసేన దోస్తీ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్, ఆరవీటి సుధాకర్ శెట్టి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ మల్కాపురం నాగిరెడ్డి, పెద్దనేలటూరు పరమేశ్వర రెడ్డి, బనవాసి ఆదినారాయణ రెడ్డి, కదిరికోట ఆదెన్న, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, టిడిపి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ కురువ సాధికారిక కమిటీ సభ్యులు, అడ్వకేట్ కెటి.మల్లికార్జున, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బి.వెంకటేశ్వర రెడ్డి, ఆత్మ మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి గోనెగండ్ల మండల నాయకులు టి.ప్రభాకర్ నాయుడు, అగ్రహారం పార్వతమ్మ, యూనుస్, గోనెగండ్ల మాజీ సర్పంచి రంగముని, అల్వాల సర్పంచి డాక్టర్ బాషా, రోజా ఆర్ట్స్ ఉసేని పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

బాలికలను వేధిస్తే ఫోక్సో చట్టం

- సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - దేవనకొండ

బాలికలపై వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు, బళ్లారి రహదారి గద్దెరాళ్ల బస్ స్టేజి దగ్గర హరిజన విజయ్ అనే యువకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈనెల 6న నిందితుడు విజయ్ దేవనకొండ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని ఏవేవో మాయమాటలు చెప్పి ఆమెను నమ్మించి, కిడ్నాప్ చేసి, మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలీసు సిబ్బందితో నిందితుని అరెస్టు చేసి మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి, నిందితుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితునికి కోర్టులో కఠిన శిక్ష పడే విధంగా సమగ్ర విచారణ, సాక్ష్యాధారాలను సేకరించి త్వరగా కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జి షీట్ చేస్తామని చెప్పారు. అలాగే 18 ఏళ్లలోపు బాలికల పట్ల ఎవరైనా వెంటపడి వేధింపులకు గురి చేస్తే ఫోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజల కోసం పని చేసే పార్టీని ఆశీర్వదించండి

- వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజల శ్రేయస్సు కోసం పని చేసే వైసిపిని, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి కోరారు. శనివారం ఆయన మండలంలోని ఐనేకల్లు, కలపర్రి, యటకల్లు, తోగలగల్లు, తురవగల్లు, తంగరడోన గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 ఎన్నికల్లో ఇచ్చిన సంక్షేమ పథకాలను, హామీలను అమలు చేసిందని తెలిపారు. కలపర్రి గ్రామంలో వేస్తున్న సిసి రోడ్డును పరిశీలించి, నాణ్యత లోపించకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ, సిసి రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అధికారంలోకి రాగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకొని, ఆలూరు ఎమ్మెల్యేను జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. ఆలూరులో వైసిపి జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్‌పిటిసి దొరబాబు, ఆస్పరి, చిప్పగిరి మండల కన్వీనర్లు పెద్దయ్య, మారయ్య, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు, కోకన్వీనర్ పురుషోత్తమ రెడ్డి, సొసైటీ సిఇఒ అశోక్, సర్పంచులు హరికృష్ణ, శంకరమ్మ, వెంకటేష్, వైసిపి నాయకులు కేశవ రెడ్డి, దత్త రెడ్డి, శివ, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆస్పరిలో సిసి రోడ్డును పరిశీలిస్తున్న విరుపాక్షి

దేవాలయ నిర్మాణానికి విరాళం

- మరోసారి దాతృత్వం చాటుకున్న విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేసి వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి మరోసారి దాతృత్వం చాటుకున్నారు. శనివారం నంచర్ల గ్రామానికి చెందిన పెద్దలు వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి ఇంటి దగ్గరకు చేరుకున్నారు. తమ గ్రామంలో ఉల్లిగమ్మ అవ్వ దేవాలయ నిర్మాణం చేపట్టామని, సహాయం చేయాలని కోరారు. గ్రామ పెద్దల విన్నపం మేరకు తక్షణమే స్పందించి ఇప్పటికీ రూ.20 వేలు అందజేస్తానని, వారికి నగదును అందించారు. భవిష్యత్తులోనూ తన సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ నిర్మాణాలకు, ఆపదలో ఉన్న నిరుపేదలకు, ప్రమాదవశాత్తు గడ్డివాములు కాలిపోయిన నిర్వాసితులకు విరుపాక్షి అండగా నిలుస్తున్నారని ప్రజలు కొనియాడారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న విరుపాక్షి

విద్యార్థుల భవితకు బాసట 'రాఘవేంద్ర'

- టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థుల భవితకు బాసటగా నిలిచిందని టిటిడి పాలకమండలి సభ్యులు, వైసిపి రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి కొనియాడారు. శనివారం శ్రీరాఘవేంద్ర ఇంటర్, డిగ్రీ కళాశాల 7వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వ్యవస్థాపకులు కీర్తిశేషులు సత్యరాజు, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బరాయుడు 30 మంది విద్యార్థులతో మంత్రాలయంలో కళాశాలను ప్రారంభించారని తెలిపారు. నేడు 350 మందికి పైగా చదువుతుండడం అభినందనీయమన్నారు. మంచి చదువులు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కళాశాల ఏర్పాటుతో ఉన్నత చదువులు చదవాలని ఆశించే పరిసర గ్రామాల యువతకు తక్కువ ఫీజులతో అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఈ సందర్భంగా డిప్లొమా కళాశాలను కూడా ఏర్పాటు చేసి విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పించాలని నిర్వహకులు సుబ్బారాయుడుకు వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి సూచించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నతంగా సంపాదిస్తున్నట్లు వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ఒక వ్యక్తిని ఉదాహరణగా చెప్పారు. రాంపురం రెడ్డి సోదరుల సహాయ, సహకారాలతో కళాశాల అభివృద్ధి చెందిందని, రానున్న రోజుల్లో కూడా వారి సహకారం ఉండాలని ప్రిన్సిపల్ సుబ్బరాయుడు కోరారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, రాఘసుధ, అశోక్ పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవ సభలో పాట పాడుతున్న విద్యార్థిని

కళాశాల వార్షికోత్సవ సభలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

మున్సిపల్ విద్యా వ్యవస్థపై స్పష్టతలేని ఉత్తర్వులు : ఎంటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ విద్యావ్యవస్థపై విద్యా శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టత లేదని ఎపి ఎంటిఎఫ్ ఆదోని అధ్యక్షులు అనిల్ కుమార్, ఆర్థిక కార్యదర్శి కోటన్న తెలిపారు. శనివారం ఆదోనిలోని ఎన్ఎంహెచ్ స్కూల్ ఆవరణలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2016లో అప్పటి ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు విడుదల చేసిన సర్వీసు రూల్స్‌నే పాత సీసాలో కొత్త సారా అన్నట్లు విద్యాశాఖ ఉత్తర్వులు 7, 8, 9, 10 ఉన్నాయన్నారు. రెవెన్యూ జిల్లాలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు, గ్రేటర్ కార్పొరేషన్లకు ప్రత్యేకంగా సర్వీసు రూల్స్ విడుదల విద్యా శాఖ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సర్వీసు రూల్స్‌తో మెజారిటీ మున్సిపల్ ఉపాధ్యాయులకు తగిన న్యాయం జరగదన్నారు. మున్సిపల్ విద్యా వ్యవస్థలో కూడా విద్యాశాఖలో లాగా ప్రభుత్వ ఉత్తర్వులు 117, 128ను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమాఖ్య నాయకులు ప్రతాప్ రెడ్డి, ఆనంద్, సురేష్ కుమార్, అలీం సిద్ధిఖీ, వెంకటేష్, శ్వేతా బాయి, రాధమ్మ, పద్మా బాయి, ప్రకాశమ్మ, సులక్షన, సువర్ణ, లలితమ్మ, సువేదమ్మ, విజయ్ కుమార్, పరిమళ, కొండమ్మ, రేణుక దేవి పాల్గొన్నారు.

తప్పుడు కథనాలు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి : ఐటిడిపి

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుపై సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు పోస్టు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిపి అధ్యక్షులు సజ్జాద్ హుసేన్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి కోరారు. శనివారం ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేసులు నమోదు చేసి తప్పుడు కథనాలకు ముగింపు పలకాలని కోరారు. టిడిపి లీగల్ కమిటీ సభ్యులు నాగేంద్రయ్య, ఉమాకుమార్, ఐసి రామకృష్ణ, వాల్మీకి మల్లి, ఈరన్న స్వామి, టిఎన్‌టియుసి మల్లికార్జున, ఐటిడిపి మండల అధ్యక్షులు గణేకల్ విరుపాక్షి, ఐటిడిపి సభ్యులు చాంద్ బాష, బ్రహ్మ, రవి, ప్రకాష్, వీరేష్, షణ్ముఖ, విజయ్, రవికృష్ణ, వీరేంద్ర, శివ, హనుమాన్ సింగ్, రామాంజి, వెంకటేష్, ఆది, షఫీ, ఖాసీం, ఉదయ్ శంకర్, నూర్ అలీ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయకపోతే

మసీదు ముందు భిక్షాటన చేస్తాం

- టిడిపి మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చేత భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే మసీదు ముందు భిక్షాటన చేస్తామని టిడిపి మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం హెచ్చరించారు. శనివారం భూములు కోల్పోయిన బాధితులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిని, వారి సంతకాలు లేకుండానే ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తన కుమారుడు, కూతురు పేరున రిజిస్టర్ చేసుకొని కాజేశారని విమర్శించారు. కోసిగి ఖాజా హుస్సేన్ అనే వ్యక్తికి శంషుద్దీన్‌తో పాటు ఫరిష బీ, మేరాజ్ బీలు వారసులని తెలిపారు. వీరికి ఆదోని శివారు ప్రాంతంలోని బసాపురం సరిహద్దులో ఉన్న పర్వతాపురం రహదారిలో సర్వే నెంబర్ 112సి-1లో 5.29 ఎకరాల పొలం ఉందన్నారు. ఖాజా హుస్సేన్ తన వీలునామాలో తన వారసుడైన శంషుద్దీన్‌కు 3 ఎకరాలు, కుమార్తెలు ఫరిషబీ, మేరాజ్ బీకి 2.29 ఎకరాలు చెందుతుందని పొందుపరిచారని చెప్పారు. వీరికి చెందిన స్థలాన్ని సంతకాలు లేకుండానే ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరుపై కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. 2021లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీనిపై బాధితులు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని కలిసి వారసత్వం కింద వచ్చే 2.29 ఎకరాల స్థలాన్ని ఏ విధంగా కొనుగోలు చేస్తారని, న్యాయం చేయాలని కోరారని తెలిపారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని శంషుద్దీన్‌తో కలిసి వారి సంతకాలు లేకుండానే రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని కాజేశారని విమర్శించారు. బాధితులు రోజువారీ కూలీలని, పనికి పోతేనే వారికి పూట గడుస్తుందని తెలిపారు. బాధితులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఇంటికి వెళ్లి న్యాయం చేయాలని కోరినా నాలుగేళ్లుగా తనకు సంబంధం లేదంటూ గడప కూడా ఎక్కనివ్వడం లేదన్నారు. న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని కన్నీరు పెట్టారు. వారం రోజుల్లోపు తమకు న్యాయం చేయకపోతే మసీదు, దేవాలయం, చర్చిల ముందు భిక్షాటన చేస్తామన్నారు.

బాధితులతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మి సలీం

దరఖాస్తు అందజేస్తున్న నరసింహులు

అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ

- డిసిసి ప్రధాన కార్యదర్శి గుడిసె నరసింహులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే మంత్రాలయం ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని డిసిసి ప్రధాన కార్యదర్శి గుడిసె నరసింహులు తెలిపారు. శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రాలయం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు విజయవాడలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గట్టి పోటీ ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు సుధాకర్ బాబు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి పరమేష్, సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ఎస్సీ సెల్ నాయకులు బజారప్ప పాల్గొన్నారు.

వృత్తివిద్యాపైనా అవగాహన అవసరం

- వృత్తి విద్యా శిక్షకులు ప్రకాష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘవరావు

ప్రజాశక్తి-ఆలూరు

విద్యార్థులు విద్యతో పాటు వృత్తి విద్యపైనా అవగాహన కలిగి ఉండాలని వృత్తి విద్యా శిక్షకులు ప్రకాష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘవరావు, ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ వీరేష్ తెలిపారు. శనివారం వృత్తి విద్యా కమిషన్ ఆదేశాల మేరకు ఆలూరులోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'లేర్నెట్ స్కిల్స్' సహకారంతో ఫీల్డ్ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులను ఆదోనిలోని ఆర్‌పిసి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌కు తీసుకెళ్లి కంప్యూటర్ స్కిల్స్, ప్రోగ్రామ్స్‌పై నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి విద్యపైనా అవగాహన కల్పించేందుకు ఫీల్డ్ ట్రిప్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు ప్రత్యక్ష అనుభవాల ద్వారా బోధన చేయడం ఉత్తమ ఫలితాలను ఇస్తుందని చెప్పారు. పిఇటి ఈరన్న, యోగా టీచర్ ప్రవల్లిక పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ వద్ద ఉన్న సిబ్బంది, విద్యార్థులు

విద్యను మించిన సంపద లేదు : సిఐ

- ప్రతిభ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న సిఐ ప్రసాద్

నేటి ప్రపంచంలో విద్యను మించిన సంపద ఏదీ లేదని సిఐ ప్రసాద్, నేషనల్ హై స్కూల్ కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రతిభ హైస్కూల్ 21వ సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆటల పాటలు ఎంతో అవసరమని తెలిపారు. చదువు వ్యక్తినే కాదు.. సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం లాంటిదని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు గురువుగా కాకుండా స్నేహభావంతో విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. ఉద్యోగాలు సాధించడానికి చదువులు కొనసాగించరాదని, ఉద్యోగాలు కృష్టించేలా చదువులు కొనసాగాలని తెలిపారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేట్ పాఠశాలలు కొనసాగించడం కత్తి మీద సాము లాంటిదన్నారు. ఇలాంటి పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడ్డారంటే ఆ పాఠశాల గొప్పతనమని తెలిపారు. అనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలు, సామాజిక నాటికలు ప్రదర్శించారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు నాగేంద్ర, కృష్ణమూర్తి, మల్లేష్, జగదీష్, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, ప్రతిభ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, సెక్రటరీ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

నృతం చేస్తున్న విద్యార్థులు

ఆశాలపై నిర్బంధం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లకు వేతనంతో కూడిన మెటర్నటి సెలవులు ఇవ్వాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంకు ఆశాలు వెళ్లకుండా పోలీసులు నంద్యాల జిల్లా కేంద్రంలో ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్టులు చేశారు. దాదాపు వంద మంది ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బందిం చారు. రాత్రి 11:30గంటలకు వెళుతున్న ఆశాలనందరిని విడతల వారిగా అరెస్టు చేశారు. 12 గంటల తరువాత ఆశలను పట్టణంలోని రాజారెడ్డి ఫంక్షన్ హాలకు తీసుకెళ్లి రాత్రంతా అక్కడే ఉంచారు. ఉదయం 11 గంటలకు వారిని సొంత పూచికత్తుపైన వదిలిపెట్టారు. సమస్యలు పరిష్కరించమంటే అరెస్టు చేసి నిర్బంధిస్తారా... ఇదీ మీకు తగునా సిఎం జగన్ మోహన్ రెడ్డి.. ఇదీ న్యాయమా అంటూ ఆశా వర్కర్లు సిఎం జగన్ మోహన్ రెడ్డి పైన ధ్వజ మెత్తారు. ఆశావర్కర్ల నిర్బంధానికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారకో నిర్వహిం చారు. దీంతో ట్రాఫిక్ స్థంభించి పోయింది. పని భారం తగ్గించాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, సిరివెళ్లలో ఆశా వర్కర్ల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున నినాదలు చేశారు. రూ.లక్షల జీతం తీసుకునే ఉద్యగులు చేయలేని పనులు కూడా చేస్తున్నా మని, గర్భవంతులు డెలివరీ సమయంలో ఎప్పుడు పడితే అప్పుడు వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన సమయాల్లో తమ కుటుంబాలను వదిలి వెళ్లాల్సి వస్తుందని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నంద్యాల జిల్లాల వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసనలు చేపట్టారు.

జిల్లాకు మొండిచేయి : వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2.86 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఆ బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన కేటాయింపులేవీ కనిపించలేదు. జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ వంటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు కేటాయించలేదు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ప్రస్తావన లేదు. ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల కోసం నిధుల కేటాయింపు జరగలేదు. రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : మునిసిపల్ కాంట్రాక్ట్, వాటర్ వర్క్స్, నగర పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జరిగిన 16 రోజుల నిరవధిక సమ్మెలో చర్చల సందర్భంగా మంత్రుల బృందం చేసిన ఒప్పందాలకు జీవోలను తక్షణమే ఇవ్వాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచారిలు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందం మున్సిపల్ ఛైర్మన్ షేక్ మాబున్నీసా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికల సన్నద్ధతకు ప్రణాళికలు సిద్ధం

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు నివేదన

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, డిఆర్ఓ పద్మజ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు నివేదించారు. శనివారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ఎ న్నికల నిర్వహణ సంసిద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులుతో పాటు డిఆర్ఓ ఎ.పద్మజ, అన్ని నియోజకవర్గాల ఈఆర్ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సమర్థవంత నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి మొదటి దఫా శిక్షణను ఇచ్చామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలన్నింటిలో విద్యుత్, టాయిలెట్లు, మంచి నీటి వసతి తదితర మౌళిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో కనీస ప్రాథమిక సౌకర్యాలు, ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, రవాణా తదితర సౌకర్యాలు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లన్నీ వెంటనే క్లియర్ చేయాలని ఈఆర్ఓలను ఆదేశించారు. వీడియో సర్వే లైన్, స్టాటికల్ సర్వే లైన్, ఎంసిసి తదితర టీంలన్నీ బుధవారంలోగా పూర్తి చేయాలని డిఆర్ఓకు సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపునకు సంబంధించిన నివేదిక ప్రతిపాదనలు కలెక్టరేట్‌కు పంపి ఆమోదం పొందిన తర్వాతనే జాబితాలో తొలగించాలని ఈఆర్వో, ఏఈఆర్ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు, నియోజకవర్గాల ఈఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు

- జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అంతర్ జిల్లాల పోలీస్ అధికారులకు సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శనివారం జిల్లా అంతర్ జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ అక్రమంగా ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు మద్యం, నాటుసారా, గంజాయి, నగదు మొదలగు వాటిని తరలించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ కంట్రోల్ కోసం తెలంగాణ, ప్రకాశం నుండి శ్రీశైలం వైపు వచ్చే భారీ వాహనాలు అనుమతించరాదని తెలిపారు. సరిహద్దుల వద్ద గల చెక్ పోస్ట్ నిఘా ఉంచాలని చెప్పారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఒకేసారి వాహనాలను అనుమతించరాదని తెలపారు. సమావేశంలో సరిహద్దు జిల్లాల డిఎస్‌పిలు వీర రాఘవరెడ్డి, కృష్ణ కిషోర్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీస్పీ సంతోష్, ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు, సీఐలు రవీంద్ర, చంద్రబాబు నాయుడు, రమేష్, ప్రసాదరావు, ఎస్ఐలు లక్ష్మణ్ రావు, గంగయ్య యాదవ్, దోర్నాల ఎస్ఐ అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి

రవాణా రంగాన్ని కాపాడుకుందాం

- సిఐటియు, ఆటో వర్కర్స్ యూనియన్, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

రవాణా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ, దోపిడీ విధానాల నుండి పోరాటాల ద్వారా కాపాడుకుందామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆలిండియా రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.శివరాం వాహన యజమానులను, డ్రైవర్లను కోరారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆటో, లారీ యూనియన్ జిల్లా నాయకుల సమావేశం ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ, దోపిడీ విధానాల వల్ల రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులైన అనేక మంది ఆటో, లారీ, బస్సు, కారు, జీపు, టాటా మ్యాజిక్, అంబులెన్స్ తదితర వాహనాలపై ఆధారపడి రవాణా రంగ కార్మికులుగా స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, ఇన్సూరెన్స్ ప్రీమియం, వాహన స్పేర్ పార్ట్స్ ధరలు పెరగడం, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు 10 శాతం నుండి 100 శాతం వరకు పెంచడంతో వాహన యజమానులు ప్రతినెలా డబ్బులు కూడా చెల్లించలేక అప్పుల పాలయ్యే పరిస్థితులు దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో పక్క కార్మికుల కొరత తీవ్రంగా ఉందని, దేశంలో 30 శాతానికి పైగా డ్రైవర్ల కొరత ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తుందన్నారు. మరో పక్క రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ పదేళ్ల జైలు శిక్ష, 10 లక్షల జరిమానా లాంటి ప్రభుత్వ లోప భూయిష్ట విధానాలతో డ్రైవర్లు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

ఈ చట్టాలు అమలయితే డ్రైవర్లు వాహనాలలో కాకుండా జైళ్లలో మగ్గే పరిస్థితులు దాపురిస్తాయని చెప్పారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 16న జరుగుతున్న ఒక్క రోజు దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్క రవాణా రంగ కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కరిముల్లా, ఖాజా, శ్రీను, రమేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా హరిప్రసాద్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా అనంతపూర్ జిల్లా నుండి బదిలీపై వచ్చిన హరిప్రసాద్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన పెనుగొండ శ్రీనివాసులు కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పెనుగొండ శ్రీనివాసులు కమిషనర్ బాధ్యతలను హరిప్రసాద్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా పలు కౌన్సిలర్లు, స్థానిక సిబ్బంది నూతన కమిషనర్ హరిప్రసాద్‌ను కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు.

ఆత్మకూర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిప్రసాద్

సిఐ ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

ఫ్లెక్సీలు చింపిన వారు మూల్యం చెల్లించుకోక తప్పదు

- డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - డోన్ : ఫ్లెక్సీలు చింపిన వారు ఎవరైనా సరే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి హెచ్చరించారు. శనివారం డోన్ పట్టణంలోని బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ ఫ్లెక్సీలను చింపివేసిన ఘటనపై ఆయన నాయకులతో డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ ప్రవీణ్ కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ఫ్లెక్సీలు చించడం, కొయ్యడం చేసిన వారిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత నెల 23న ఫెక్సీ చింపినపుడు కూడా ఫిర్యాదు చేశామని, మళ్లీ ఇప్పుడు రెండవసారి ఫ్లెక్సీలను చింపారన్నారు. ఫ్లెక్సీలు చించినంత మాత్రాన ప్రజల గుండెల్లో ఉన్న తనను చెరపలేరని, ఇలాంటి తప్పుడు పనులకు పాల్పడిన వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్

ప్రజాశక్తి - డోన్ : రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం ఏపీఎస్ఆర్టీసీ డోన్ డిపో ఆధ్వర్యంలో సూపర్వైజర్లు, సిబ్బంది కలసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు రోడ్డు భద్రతా సూత్రాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. మోటార్ బైక్‌లు నడిపే వారు విధిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ ఐవిఆర్ రెడ్డి, ట్రాఫిక్ సూపర్వైజర్ శ్రీనివాసులు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మద్దయ్య, కానిస్టేబుల్ దినేష్ రెడ్డి, గ్యారేజ్ సూపర్వైజర్లు గోపాల్, పుల్లయ్య, గ్యారేజీ మెకానిక్‌లు, సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్

హామీలు జీవో రూపంలో ఇవ్వాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు

ప్రజాశక్తి - నంద్యాల

అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవో రూపంలో విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని నేషనల్ పీజీ కాలేజీ ఆడిటోరియంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ సైదాంతిక శిక్షణ తరగతులు సిఐటియు జిల్లా జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అధ్యక్షతన ప్రారంభించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి రమేష్ కుమార్ మాట్లాడారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, సీనియార్టీ అర్హత కలిగిన టీచర్లకు సూపర్వైజర్లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని కోరారు. వైయస్సార్ సంపూర్ణ కోసం మెనూ చార్జీలు పెంచి గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఇంటి అద్దెలు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవో రూపంలో అమలు చేయకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, కెఎండి.గౌస్, జిల్లా సహాయ కార్యదర్శులు వి.బాల వెంకట్, డి.లక్ష్మణ్, ఎపి శివరాం, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శోభారాణి, నిర్మలమ్మలు మాట్లాడారు. ఈ సమావేశంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ సీనియర్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి, హరిత, సునీత, రమణమ్మ, నాగమణి, లక్ష్మీ సుధా, నాయకురాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమీర్ బాషా

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : అమీర్ బాషా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ బాషా అన్నారు. శనివారం స్థానిక ఇండియన్ గ్లోబల్ హైస్కూల్‌లో కరెస్పాండెంట్ వెంకటేశ్వర రెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లు దస్తగిరి, ప్రసాద్ రెడ్డిల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు రావాలని కోరుకుంటూ సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు తెచ్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తెచ్చే విధంగా శ్రద్ధగా చదవాలన్నారు. విద్యార్థులు విజ్ఞాన సంపదను దేశాభివృద్ధికి వినియోగించి దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం వైఎస్ఆర్ జగనన్న ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శనివారం బేతంచెర్ల పట్టణంలో 5వ వార్డు ఆర్ఎంబి గెస్ట్ హౌస్ ఏరియాలో నూతనంగా రూ. 80 లక్షలతో నిర్మించిన వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నగర పంచాయతీ చైర్మన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిపి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల రాష్ట్ర డైరెక్టర్ బాబుల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజల సౌకర్యార్థం, రైతుల సంక్షేమం కోసం ఆరోగ్య ఉప కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించినట్లు తెలిపారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలో సిసి రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ముర్తుజావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ ఖాజా హుస్సేన్, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ సీతారామ చంద్రుడు, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ మురళీ కృష్ణ, మాజీ మద్దిలేటి స్వామి చైర్మన్ బీరేలి నాగేశ్వర రెడ్డి, సొసైటీ సింగల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వైసిపి సీనియర్ నాయకులు ఎద్దుల సురేంద్ర నాథ్ రెడ్డి, గూని నాగరాజు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు మొబినా, చింత నాగిరెడ్డి, ప్లాట్ల దస్తగిరి, కోట్ల మధు, బుగ్గన భాస్కర్ రెడ్డి, నిరంజన్, తవిసికొండ సర్పంచ్ బండ కాటి వెంకటేశ్వర రెడ్డి, టౌన్ కన్వీనర్ ఖాజా హుస్సేన్, డక్కి శేఖర్, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి, సచివాలయం కన్వీనర్లు వలి భాష, తలారి మల్లికార్జున, సాయికిరణ్, నూర్ కమల్, అడపాల తిరుమలేష్, భాస్కర్, గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు మధుసూదన్ రెడ్డి, మర్రికుంట మురళీధర్ రెడ్డి, అవివేటి చంద్రశేఖరయ్య, కాజా,సుల్తాన్, సాలబోయిన నాగరాజు, నడ్డి శ్రీనివాసులు, బొద్దుల రమేష్, బొల్లి మద్దిలేటి, గజ్జి మురళి సుబ్బారెడ్డి, కష్టుడు, రంగనాయకులు, దూదేకుల కమల్, లక్ష్మీకాంతరెడ్డి, ఇస్మాయిల్,దేవుడు మద్దయ్య, కాంట్రాక్టర్ ఖాదర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపిపి బుగ్గన నాగభూషణ్ రెడ్డి

మురికికూపంగా నంద్యాల పట్టణం : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలో పారిశుధ్యం, పరిశుభ్రత ఎక్కడని, పట్టణం మురికి కూపంగా మారిందని కాంగ్రెస్ పార్టీ తరపున నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోళ్ల రాజేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల పట్టణ చరిత్రలో ఎన్నడు లేని విధంగా మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దాదాపు 20 కోట్లు విలువ చేసే రెండు ఎకారల స్థలాన్ని కబ్జా చేశారని, ఈ విషయం రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు తెలిసి కుడా నిమ్మకు నీరెతినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 42 వార్డులలో దోమలు నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బ్లీచింగ్ పౌడర్, సున్నం తదితర వాటికి నిధులు విడుదలవుతున్నా ఆఫీసుకు చేరడం లేదని కొందరు కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తెచ్చినా ఫలితం లేదన్నారు. పారిశుధ్య సిబ్బందికి బట్టలు, సబ్బులు ఇవ్వలేదని కౌన్సిల్ లో సాక్షాత్తు మాజీ చైర్మన్, కౌన్సిలర్ దేశం సులోచన తెలిపినా చైర్మన్ మాబున్నిసానే ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తెస్తే న్యాయం జరుగుతుందని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సమస్యలపై స్పందించే తన లాంటి నాయకుడికి అండగా నిలవాలని ప్రజలను కోరారు.

ప్రజా పోరాటాలకు అండగా నిలవాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేసే సిపిఎంకు ప్రజలు అండగా నిలవాలని, విరాళాలు ఇచ్చి తోడుపాటు అందించాలని సిపిఎం నాయకులు కోరారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో, మండలంలోని గ్రామాలలో ప్రజల నుండి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం నిత్యం ఉద్యమిస్తుందన్నారు. సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్థంగా పాటు పడుతుందన్నారు. పెరుగుతున్న ధరలతో, తరుగుతున్న ఆదాయాలతో, నిరుద్యోగంతో సామాన్యులు సతమతమవుతున్నారని చెప్పారు. విభజన చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని తెలిపారు. ఈ దశలో ప్రజల కోసం సిపిఎం అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. పోరాటాలు, ఉద్యమాలు మరింతంగా నిర్వహించేందుకు ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ప్రజాసంఘాల నాయకులు ప్రసాద్, రాజు, ఏసేపు, చిన్న రాముడు, మాధవస్వామి, రాజు, దేవన్న, బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ఆర్‌బికె ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శిల్పా తదితరులు

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వెలుగోడు : మండలంలోని బోయరేవుల గ్రామంలో రూ. 23 లక్షల 94 వేలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శ్రీశైల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం ప్రారంభించారు. అలాగే బోయరేవుల సచివాలయ పరిధిలో ఉన్న సీసీ రోడ్డును, రేగడ గూడూరు గ్రామంలో సచివాలయం-1ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ సిబ్బంది ప్రజల అవసరమయ్యే ప్రతి ఒక్క సేవను వారికి అందించి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, మండల ప్రజాపతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్‌పి అడ్మిన్‌గా కె.ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా కె.ప్రవీణ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్దకు అడిషనల్ ఎస్పీ రాగానే ఆర్మ్మార్ రిజర్వు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తన ఛాంబర్ నందు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిని ఆయన పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అడ్మిన్‌ను స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి సంతోష్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు, రిజర్వ్ సబ్- ఇన్స్పెక్టర్‌లు, ఓఎస్‌డి సిబ్బంది, అడిషనల్ ఎస్పీ సీసీ రాఘవేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీశైలంలో సుందరీకరణకు చర్యలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో సుందరీకరణను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు శనివారం తెలిపారు. మరింత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు క్షేత్ర పరిధిలోని ఉద్యానవనాలలో ప్రత్యేకంగా మొక్కలను తీసుకువచ్చి నాటించారు.

జగనన్నకు మహిళలే ఆసరా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళల ఆసరాతోనే జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని పాణ్యంఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శనివారం వీర నారాయణ స్వామి దేవస్థానంలో జరిగిన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పొదుపు మహిళలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ అహ్మద్, మండల అధ్యక్షురాలు హుస్సేన్ బీ, జడ్పిటిసి సరలమ్మ, మండల నాయకులు సూర్య నారాయణ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం వెనక ఆంతర్యం..?

- నేడు అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం
- రాజకీయంగా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం..?

ప్రజాశక్తి - ఆత్మకూర్

నేడు ఆత్మకూరు పట్టణంలో హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్ హుస్సేన్ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు శ్రీశైల నియోజవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూర్, మహానంది, శ్రీశైలం, సున్నిపెంట తదితర ప్రాంతాల్లో ఉన్న ముస్లిం మైనార్టీలను ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన నేరుగా ఫోన్ ద్వారా ఆహ్వానించారు. టిడిపిలో వ్యతిరేకంగా ఉంటున్న ఈయన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించడం వెనక మర్మమేమిటోనని బహిరంగంగా చర్చ నడుస్తోంది.

శ్రీశైలం నియోజవర్గంలో రాబోవు ఎన్నికల్లో వైసిపికి ఎదురుగాలి తప్పదన్న నేపథ్యంలో టిడిపిలో సుదీర్ఘంగా పని చేసిన అహ్మద్ హుస్సేన్ పార్టీలో ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, హజ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించడంతో పాటు అతని తనయుడు ముస్తఫా రాయలసీమలో టిడిపి కార్యకర్తలకు శిక్షణ తరగతులు చెప్పేందుకు ప్రత్యేక బాధ్యతలను తీసుకున్నారు. అయితే గత కొద్దిరోజుల నుండి అహ్మద్ హుస్సేన్ స్వతంత్రంగా పార్టీ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు టిడిపి నియోజవర్గ నాయకత్వానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. మొదటి నుండి మోమిన్ అహ్మద్ హుస్సేన్ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి దగ్గరగా ఉంటూ వచ్చేవారు. బుడ్డా వెంగల్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అహ్మద్ హుస్సేన్ ఆయన అనుచరుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. బుడ్డా వెంగళరెడ్డి సైతం అహ్మద్ హుస్సేన్‌కి రాజకీయంగా ప్రత్యేక గుర్తింపుని ఇచ్చేవారు. కాలక్రమేనా అహమ్మద్ హుస్సేన్, అతని కుమారుడు స్థానిక నాయకత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేసుకుంటూ వెళుతున్న నేపథ్యంలోని మోమిన్ ముస్తఫాకు పార్టీ అప్పగించిన బాధ్యతల నుండి తొలగించారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్ హుస్సేన్ ఆదివారం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వాటిని విజయవంతం చేసేందుకు శ్రీశైల నియోజవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూర్, మహానంది, శ్రీశైలం, సున్నిపెంట తదితర ప్రాంతాల్లో ఉన్న ముస్లిం మైనార్టీలను ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన నేరుగా ఫోన్ ద్వారా ఆహ్వానించారు. టిడిపిలో వ్యతిరేకంగా ఉంటున్న ఈయన తన రాజకీయ భవిష్యత్తును మైనార్టీ ప్రజల ముందు ప్రకటించి వైసిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు పలువురు ముస్లిం మైనార్టీ ప్రజలు ఆరోపిస్తున్నారు. మోమిన్ అహ్మద్ హుస్సేన్ టిడిపి టికెట్ ఇస్తే శ్రీశైలం నియోజవర్గం నుండి పోటీ చేస్తానని గతంలోనే ప్రకటించారు. ఆర్థికంగా, రాజకీయంగా శ్రీశైలం నియోజవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే శక్తి ఆయనకు లేదని టిడిపి కార్యకర్తలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్ నిర్వహించబోతున్న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం ఏ రాజకీయ పార్టీ వైపునకు తీసుకెళ్ళేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారని నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ప్రజలు చర్చించుకుంటున్నారు.

మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

పివికి భారతరత్న అభినందనీయం

- బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

అపర చాణక్యుడు, పలు భాషా కోవిదుడు పివి నరసింహ రావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ఇవ్వడం అభినందనీయమని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల నుండి రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా గెలిచి దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, నంద్యాలలో అనేక అభివృద్ధి పనులను నిర్వహించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పివి నరసింహారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. సమావేశంలో బాలమురళకృష్ణ, రాజశేఖర్, చంద్రశేఖర్, భరద్వాజ పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలకు, అన్నదానానికి అనుమతులివ్వాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెంకటాపురం మీదుగా నల్లమల్ల ఫారెస్టులో కాలినడకన వెళ్లే భక్తులకు అన్నదానానికి, చిరు వ్యాపారాలకు ఫారెస్ట్ ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. శనివారం సుండిపెంట కాలనీలోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవిలోని మార్గమధ్యలో మంచినీటి సదుపాయాలు, ఉచిత మెడికల్ క్యాంపులు, అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఆసరాగా ఎంతోమంది దాతలు సేవ దృక్పథంతో సేవ చేస్తుంటారని వివరించారు. మధ్య మధ్యలో కొంతమంది పేదలు చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని తినుబండారాలు యాత్రికులకు అందిస్తుంటారని, వారికి తాగునీరు సౌకర్యాన్ని కల్పిస్తారని చెప్పారు. కైలాస ద్వారం దగ్గర భక్తులకు సేద తీసుకునే సమయాల్లో చిన్న చిన్న తినుబండారాలు వారి ఆకలిని తీరుస్తాయని తెలిపారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని నాగలూటీ, పెచెర్వు, భీమునికొలను, కైలాసద్వారం, హటకేశ్వరం ప్రాంతాల్లో అన్నదానానికి, చిరు వ్యాపారాలకు ఫారెస్ట్ ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు వై.శీను, పి.మల్లికార్జున, ఏ.బెనహర్, వెంకటేశ్వర్లు, బాబు, ఎస్.కే.వలీ, అప్పలకొండ, నాగూర్ వలి, షేక్షావలి, నాగ మల్లికార్జున, కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజనసంక్షేమ సంఘం నాయకులు కులమయ్య, వీరయ్య, శివపార్వతుల చెంచు గిరిజన సంక్షేమ సంఘం నాయకురాలు కే.మల్లికార్జున, కామేశ్వరి, భ్రమరాంబ, అల్లూరి సీతారామరాజు ఆదివాసి చెంచు గిరిజన సంఘం నాయకులు కుడుముల వెంకటేశం, గంగయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - చాగలమర్రి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యమైనది, మెనూ ప్రకారం అందించాలని ఎంఈవో న్యామతుల్లా తెలియజేశారు. శనివారం చాగలమర్రి పట్టణంలోని బుగ్గ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.

మూల విగ్రహా ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవస్థానంలో మూల విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ, వీరి కోడలు కాటసాని మేధా శ్రీరెడ్డిలు మహాకుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు చౌడేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 10 నుండి 14 తేదీ వరకు అమ్మవారి మూల విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ ఈవో రామానుజన్ తెలిపారు. ఈవో పర్యవేక్షణలో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

అహోబిలంను ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిలంను ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా తీర్చిదిద్దుతామని యువ నాయకుడు గంగుల ఫణి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన అహోబిల క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎగువ, దిగువ క్షేత్రాలలో కొలువైన నారసింహులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అహోబిలం మఠం ప్రతినిధి సంపత్‌ను కలిసి క్షేత్రంలో చేయవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అహోబిలం నవ నరసింహ క్షేత్రాలలో ప్రకృతి పర్యావరణాన్ని పెంపొందించేందుకు మఠం, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్షేత్ర పరిసరాలలో సువిశాలమైన మైదానం, నీటి వనరులు ఉన్నాయని, నర్సరీని సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి నర్సరీలో సాగు చేసిన మొక్కను అందించి వారి ఇంటిలో పెంచే బాధ్యత అప్పజెప్పాలన్నారు. మఠం వారు నర్సరీ పెంచేందుకు ముందుకు వచ్చారని, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడాక ముందుకు వెళ్తామని హామీనిచ్చారు. క్షేత్రంలో గోవులను పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలపారు. ముందుగా అక్కడ గోవులకు తాగునీరు, గడ్డి అందుబాటులో ఉండేలా మఠం చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను క్షేత్రాలలో ఎక్కడంటే అక్కడ పారేయకుండా మఠం వారు ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలలో వేయాలన్నారు. త్వరలోనే తాను, తన టీం కలిసి అహోబిలం క్షేత్రాలలో యుద్ధ ప్రాతిపదికన ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, అహోబిలం శ్రీను, ఓబులంపల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అహోబిల క్షేత్రంలో యువ నాయకులు ఫణి కృష్ణారెడ్డి

నూతన పైపు లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు నందు శనివారం కౌన్సిలర్ యం.సమీరా భాను, జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్ ఆధ్వర్యంలో నూతన పైపు లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి సహకారంతో వార్డు ప్రజల అవసరాలను తీర్చడంలో ఎప్పుడు ముందుంటామని అన్నారు.

మహేష్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణానికి చెందిన టిడిపి కార్యకర్త వెల్డింగ్ షాప్ మహేష్ గౌడ్‌కు ఆ పార్టీ మండల అధ్యక్షులు అన్నారపు శేషి రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం రూ.50 వేలు ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. వారు మాట్లాడుతూ మహేష్ గౌడ్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలులో చికిత్స పొంది కోలుకొని ఇంటికి వచ్చినట్టు తెలిపారు. నేడు మహేష్ గౌడ్‌ను పరామర్శించి ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘుస్వామి రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకట రామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎంఇఒ బ్రహ్మం నాయక్, కాంత్ రెడ్డి, వకీల్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి అండగా ఉంటాం

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

తమను నమ్మి పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం మండలంలోని కోట కందుకూరు గ్రామానికి చెందిన 100 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. బీబీ ఆధ్వర్యంలో జాఫర్ వలి, సుబ్బారెడ్డి, మాబున్ని, గౌసియా, హాజీర, నాజీమా, అమ్మిరాన్ తో పాటు మరి కొంతమంది టిడిపిలోకి చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి భూమా అఖిలప్రియ, భార్గవరామ్ దంపతులు టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చాంద్ భాషా, కాంట్రాక్టర్ నన్నే భాయ్ గారి జిలాన్, తాలూకా నాయకులు ఆళ్ల నాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిన వారితో భూమా అఖిల ప్రియ

యువతను వంచించిన జగన్ : మాజీ ఎమ్మెల్యే

కొలిమిగుండ్ల : ష్యూరిటీ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైసిపి ప్రభుత్వంలో నాపరాయి పరిశ్రమ కుదేలైందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలం గోర్విమానుపల్లి గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేకు టిడిపి మండల అధ్యక్షుడు ములే రామేశ్వర్ రెడ్డి, హుస్సేన్ రెడ్డిలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు రత్నమయ్య, పెద్దయ్య, శివారెడ్డి, తెలుగు మండల యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్, రామ్మోహన్, సత్యనారాయణ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, నాగమల్లారెడ్డి, టైలర్ రాము, నాగార్జున రెడ్డి, ప్రసాద్, కృష్ణ, రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, అందే రాము, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రావాలని టిడిపి డోన్ నియోజవర్గ ఇంచార్జి మన్నే సుబ్బారెడ్డి అన్నారు. ప్యాపిలి పట్టణంలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించి బాబును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మురళి కృష్ణ గౌడ్, రాఘవేంద్ర, అంకిరెడ్డి, రామ సుబ్బయ్య, రామ్మోహన్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, చిన్న సుంకయ్య, సుదర్శన్, చల్లా వీర, కొంగనపల్లె మధు, మల్లికార్జున, ప్రిన్సిపాల్ మధు, మౌలాలి రెడ్డి, నాగేంద్ర, కోదండ రామయ్య, వెంకటేశ్వర రెడ్డి బ్యాంకు శీను,రాజు, తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** రాష్ట్రంలో రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారం సాధించడం ఖాయమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా శ్రీశైలం మండలం సుండిపెంటతో పాటు శనివారం లింగాలగట్టులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు అవకాశాలు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. అభివృద్ధి కోసం పాటుపడే తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని యువతకు సూచించారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న జగన్మోహన్ రెడ్డి ఇంతవరకు ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. డిగ్రీ చదివిన వారికి వాలంటీర్స్ ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు పెద్దపేట వేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి లింగాల గట్టు నాయకులు సుబ్బారాయుడు, శ్రీను, చిట్టిబాబు, సుండిపెంట నాయకులు వీపీపీ బెంజిమెన్, జంకే రామసుబ్బారెడ్డి, అడుసుమల్లి సుబ్బారావు, ఉమా, రూపస్, మీనిగే శీను, రమణ, జనసేన నాయకులు దేవిశెట్టి నాగసాయి, మహిళలు పాల్గొన్నారు.

ప్యాపిలి : బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

శ్రీశైలం ప్రాజెక్టు : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- సినీ నటుడు పృథ్వీరాజ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని సినీ నటుడు పృథ్వీరాజ్ తెలిపారు. శనివారం నంద్యాలలో జరిగిన జనసేన కోసం మెగా ఫ్యాన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎపిలో ఏ జిల్లాకు వెళ్లినా, గ్రామానికి వెళ్లినా నిశ్శబ్ద వాతావరణం, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్టంలో 136 అసెంబ్లీ, 21 ఎంపీ స్థానాలను టిడిపి, జనసేన కూటమి గెలుచుకోబోతుందని జోస్యం చెప్పారు.

'సుకన్య సమృద్ధి' బాలికలకు వరం

ప్రజాశక్తి - రుద్రవరం

సుకన్య సమృద్ధి ఖాతా బాలికలకు వరం లాంటిదని ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టర్ మౌళీశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చిన్న కంబలూరు గ్రామంలో పోస్ట్ ఆఫీస్‌లో లభించే వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తూ వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లో ఎస్బి, ఆర్డి, సుకన్య సమృద్ధి ఖాతా, అలాగే టైం డిపాజిట్ మొదలగు పొదుపు ఖాతాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్రధానంగా గ్రామీణ తపాలా జీవిత బీమా, ఉద్యోగులు పట్టభద్రుల కోసం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకున్నట్లయితే బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ ఖాతాలలో పొదుపు చేసుకోవడం ద్వారా భవిష్యత్తుకు బాసటగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది భాస్కరరావు, పెద్దరాజు, బాలన్న, శ్రీరామచంద్రరావు, భాస్కర్, పలువురు ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రూ. 6 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంకానాల, పాండురంగాపురం, మిట్నాల, శివరామాపురం గ్రామాల్లో రూ. 6 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. కానాల గ్రామం నుండి పాండురంగాపురం గ్రామం వెళ్లే దారిలో నూతన బ్రిడ్జి, మిట్నాల నుండి శివరాంపురం గ్రామం వరకు నిర్మించిన రోడ్డు, మిట్నాలలో నిర్మించిన ఏపీ మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేపట్టామన్నారు. ఒకే రోజు 6 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించడం ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిపి మధుసూధన్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైస్ ఎంపీపీ జనార్ధన్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, తిరుపాల్రెడ్డి, పున్నారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, డీఈఓ సుధాకర్ రెడ్డి, ఎంఇఒ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి

కూటమి గెలుపును ఎవరూ ఆపలేరు : ఎన్ఎండి.ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తెలుగుదేశం, జనసేన కూటమి గెలుపును ఎవరూ ఆపలేరని, మూడు నెలల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి శ్రీకారం చుట్టబోతున్నట్లు మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం 'జనసేన కోసం మెగా సైన్యం' నినాదంతో జనసేన నాయకులు సుధాకర్, విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం నుండి జగన్ రెడ్డి అరాచకాలపై శంఖారావంతో కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై, అరాచక పాలనపై గొంతెత్తి ప్రజలకు వివరించేందుకు రానున్న 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోకేష్ పర్యటిస్తారని తెలిపారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా నోట్ చేస్తారని, బాబు హామీ-భవిష్యత్తుకు హామీ కార్యక్రమంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి రాష్ట్రవ్యాప్తంగా వివరిస్తూ ప్రతి ఇంటికీ చేరువవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పృథ్వి రాజ్, విత్తనాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ ఏవి సుబ్బరెడ్డి, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్, రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, తులసి రెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనారిటీ నాయకులు బాబుల్లా పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన కొనసాగుతుందని, రానున్న ఎన్నికల్లో టిడిపి - జనసేన గెలుపును ఎవరూ ఆపలేరని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 11 నుంచి శంఖారావం పేరుతో ప్రజల్లో మమైకం కానున్నారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ షేక్ హుస్సేన్ భాష పాల్గొన్నారు. **బనగానపల్లె :** జగన్ రెడ్డి అరాచకాలపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాధమే శంఖరావమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. **ఆత్మకూర్ :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా నేటి నుండి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాదమే శంఖారావమని శ్రీశైలం మాజీ బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం దిగ్విజయం కావడానికి అన్ని వర్గాల వారు మద్దతు తెలియజేయాలని కోరారు.

నంద్యాలలో సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

బనగానపల్లె : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

2024 మరియు 25 సంవత్సరములకు గాను

రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ మదర్ ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలో లంబాడి సుగాలి యానాది ఏరుకుల చెంచు ఎస్టి విద్యార్థులకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు హాస్టల్‌తో ఉచిత విద్య త్వరపడండి. తీసుకొని రావలసిన సర్టిఫికెట్స్ క్యాస్ట్ మరియు ఇన్కమ్ విద్యార్థి ఆధార్ తల్లి ఆధార్ తండ్రి ఆధార్ విద్యార్థి చదువుతున్న పాఠశాల నుండి స్టడీ సర్టిఫికేట్ బియ్యం కార్డ్ తీసుకొని రావలసి ఉంటుంది.

వివరములకు :
బాలచంద్ర సమత విద్యానికేతన్ టెక్కే నంద్యాల.
సెల్ : 9398837182